సాక్షి

డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

బుధవారం | 29 | మార్చి | 2023



డెల్టాలకు నీటి విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి మంగళవారం గోదావరి తూర్పు డెల్టా కాలువకు 1,960, మధ్య డెల్టాకు 1,275, పశ్చిమ డెల్టాకు 3,400 క్యూసెక్కుల నీరు వదిలారు.



ఒకటి నుంచి కల్యాణోత్సవాలు


కడియం: స్థానిక కెనాల్ రోడ్డులోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారి కల్యాణోత్సవాలు ఏప్రిల్ 1 నుంచి 3వ తేదీ వరకూ జరుగుతాయి.

అందాల స్వామికి.. కల్యాణ వేడుక



శ్రీ జగన్మోహినీ కేశవస్వామి వారి కల్యాణోత్సవాలకు సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం ర్యాలి గ్రామం ముస్తాబవుతోంది. ఈ నెల 30 నుంచి వచ్చే నెల 6వ తేదీ వరకూ స్వామి వారి కల్యాణోత్సవాలు నిర్వహించనున్నారు.

8లో





శోభాయమానంగా కల్యాణ వెంకన్న ఆలయం

వెంకన్న ఆలయం.. దేదీప్యమానం

అమలాపురం శ్రీ, భూ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాలకు ముస్తాబవుతున్నారు. ఈ నెల 31వ తేదీన స్వామి వారి కల్యాణం జరగనుంది. కల్యాణ వేంకటేశ్వరస్వామిగా పేరొందిన ఈ స్వామి ఆలయాన్ని ఇటీవల అద్భుతంగా ఆధునీకరించారు. ఇది భక్తులను విశేషంగా ఆకర్షిస్తుండగా.. కల్యాణోత్సవాల వేళ ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలంకరణతో ఆలయం దేదీప్యమానంగా మెరిసిపోతోంది. చూపరులను కట్టిపడేస్తోంది.

– సాక్షి, అమలాపురం



విద్యుద్దీప తోరణాల్లో శిల్పాలు



కాంతులీనుతున్న గాలిగోపురం

న్యూస్‌రీల్

లక్ష్మీనృసింహునికి రూ.24,73,111 ఆదాయం



హుండీల ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహునికి హుండీల ద్వారా రూ.24,73,111 ఆదాయం సమకూరిందని ఆలయ అసిస్టెంట్ వి.సత్యనారాయణ తెలిపారు. ఎండోమెంట్స్ కార్యనిర్వహణాధికారులు కె.గంగాధర్, టి.నాగవిష్ణు పర్యవేక్షణలో ఆలయంలో మంగళవారం హుండీల ఆదాయాన్ని లెక్కించారు. 49 రోజులకు గాను మెయిన్ ఆలయ హుండీ, గుర్రాలక్క అమ్మవారి ఆలయ హుండీల ద్వారా రూ.24,21,346, అన్నదానం హుండీ ద్వారా రూ.51,765 సమకూరాయని వివరించారు. దీంతో పాటు 4 గ్రాముల బంగారం, 361 గ్రాములు వెండి, పలు దేశాల కరెన్సీ కూడా వచ్చాయని సత్యనారాయణ చెప్పారు.

విఘ్నేశ్వరునికి రూ.16.97 లక్షలు..

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామి ఆలయంలో హుండీల ఆదాయాన్ని దేవదాయ శాఖ పర్యవేక్షకుడు, తనిఖీదారు జంపా లింగేశ్వరరావు ఆధ్వర్యాన మంగళవారం లెక్కించారు. 42 రోజులకు గాను రూ.16,97,482 ఆదాయం సమకూరిందని ఆలయ చైర్మన్ నంబూరి వెంకటరమణరాజు తెలిపారు. అలాగే 15.5 గ్రాముల బంగారం, 443.5 గ్రాముల వెండి లభించాయన్నారు. కార్యక్రమంలో ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు, పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

శనైశ్చరునికి రూ.7.58 లక్షలు..



హుండీల ఆదాయం లెక్కిస్తున్న సేవా వలంటీర్లు, స్థానికులు

కొత్తపేట: మందపల్లి ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామి వారికి హుండీల ద్వారా రూ.7,58,829 ఆదాయం వచ్చిందని దేవదాయ, ధర్మదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, దేవస్థానం ఈఓ సింగం రాధ తెలిపారు. రావులపాలెం మండలం పొడగట్లపల్లి ధర్మసత్రం ఈఓ ఎం.రాధాకృష్ణ పర్యవేక్షణలో గ్రామ పెద్దలు, పోలీసుల సమక్షంలో మంగళవారం హుండీలను తెరవగా సేవా వలంటీర్లు నగదు లెక్కించారు. ఏడు నెలల 23 రోజులకు గాను ఈ ఆదాయం వచ్చిందని రాధ తెలిపారు. అలాగే ఆలయ క్షేత్ర పాలకుడు వేణుగోపాలస్వామి వారి హుండీల ద్వారా రూ.46,004 ఆదాయం వచ్చిందని చెప్పారు.

భీమేశ్వరునికి రూ.5.89 లక్షల రాబడి



హుండీల ఆదాయం లెక్కిస్తున్న సేవా వలంటీర్లు, స్థానికులు

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి వారికి హుండీల ద్వారా రూ.5,89,454 ఆదాయం సమకూరిందని ఈఓ పీటీవీవీ సత్యనారాయణమూర్తి (తారకేశ్వరరావు) తెలిపారు. గత ఫిబ్రవరి 22 నుంచి మంగళవారం వరకూ హుండీల ద్వారా వచ్చిన ఆదాయాన్ని ఆలయ ప్రాంగణంలో లెక్కించారు. దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ బాలాజీ రామ్‌ప్రసాద్, వెంటూరు గ్రూపు దేవాలయాల ఈఓ శ్రీదేవి, పెద్దలు, అనపర్తికి చెందిన భీమేశ్వరుని సేవా సిబ్బంది, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

కడుపు కోతకు నో..



- సాధారణ కాన్పులకే మొగ్గు
- అవే మేలంటూ వైద్య, ఆరోగ్య సిబ్బంది ప్రత్యేక కౌన్సెలింగ్
- గర్భిణుల్లో పెరుగుతున్న అవగాహన
- సిజేరియన్ వద్దంటున్న అత్యధికులు
- జాతకాల నమ్మకాలు వీడితే మరింతగా పెరిగే అవకాశం

సాక్షి, అమలాపురం: జిల్లాలోని ప్రైవేటు ఆస్పత్రుల్లో సిజేరియన్ ప్రసవాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. దీనిపై గత ఏడాది నవంబర్‌లో జరిగిన దిశా సమావేశంలో ప్రజాప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో సాధారణ ప్రసవాలపై జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తోంది. సాధారణ ప్రసవాల వల్ల తల్లీబిడ్డలకు కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించడం.. గర్భ నిర్ధారణ అయిన నాటి నుంచి, ప్రసవం వరకూ ఆశా వర్కర్ల నుంచి ప్రభుత్వ వైద్యుల వరకూ పర్యవేక్షణ.. అత్యధికంగా సిజేరియన్ చేస్తున్న ప్రైవేటు ఆస్పత్రులపై నిఘా.. వెరసి ఇటు ప్రభుత్వ, అటు ప్రైవేటు ఆస్పత్రుల్లో సిజేరియన్ కత్తెరలకు అడ్డుకట్ట పడుతోంది. అమ్మ కడుపు 'కోత'కు అడ్డుకట్ట వేసేందుకు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ చేపట్టిన 'స్పెషల్ డ్రైవ్' సత్ఫలితాలనిస్తోంది.

- ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకూ జిల్లాలో 21,104 ప్రసవాలు జరగగా, వీటిలో సాధారణం 6,889 (32 శాతం), సిజేరియన్ 14,215 (68 శాతం) ఉన్నాయి.
- గత ఏడాది ఏప్రిల్ నుంచి అక్టోబర్ నెలాఖరు వరకూ పరిశీలిస్తే మొత్తం ప్రసవాలు 12,934 కాగా, వీటిలో సాధారణం 3,427 (26 శాతం), సిజేరియన్ 12,934 (74 శాతం) ఉన్నాయి.
- సిజేరియన్లు ఎక్కువగా జరగడంపై వైద్య, ఆరోగ్య శాఖ దృష్టి పెట్టింది. సాధారణ ప్రసవాలు చేసుకునేలా గర్భిణుల్లో చైతన్యం కల్పించింది. దీంతో మెరుగైన ఫలితాలు వచ్చాయి. గత ఏడాది నవంబర్ నుంచి ఫిబ్రవరి వరకూ జిల్లాలో 7,170 ప్రసవాలు జరగగా.. వీటిలో సాధారణం 2,809 (39 శాతం), సిజేరియన్ 4,361 (61 శాతం) మాత్రమే నమోదయ్యాయి.
- ప్రభుత్వాస్పత్రుల్లో అక్టోబర్ నెలాఖరు వరకూ సాధారణ ప్రసవాలు 45 శాతం కాగా, తదనంతరం ఇది 91 శాతానికి పెరిగింది. అదే ప్రైవేటు ఆస్పత్రుల్లో అక్టోబర్ వరకూ 15 శాతం కాగా, ఈ సీజన్‌లో అది కాస్తా 34 శాతానికి పెరగడం గమనార్హం.
- ప్రభుత్వాస్పత్రుల్లో సిజేరియన్ 55 నుంచి 9 శాతానికి తగ్గగా, ప్రైవేటు ఆస్పత్రుల్లో 85 నుంచి 66 శాతానికి తగ్గడం విశేషం.

ఫలిస్తున్న చర్యలు

- సాధారణ ప్రసవాలపై ప్రత్యేక దృష్టి పెట్టి, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలను ఇస్తోంది. గర్భం దాల్చిన నాటి నుంచి ప్రసవం అయ్యేంత వరకూ వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, ఫ్యామిలీ వైద్యుల ఆధ్వర్యాన నిరంతర పర్యవేక్షణ వల్ల వారి ఆరోగ్య పరిస్థితిని పక్కాగా అంచనా వేస్తున్నారు. అత్యవసరమైతే తప్ప సాధారణ ప్రసవమే మేలని అవగాహన కల్పిస్తున్నారు.



ఉప్పలగుప్తం మండలం పేరాయి చెరువులో గర్భిణికి వైద్య పరీక్షలు చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

- సాధారణ కాన్పుల వల్ల తల్లీబిడ్డలకు ఆరోగ్యపరంగా జరిగే మేలు వివరిస్తున్నారు. జాతకాలు, నక్షత్ర బలం కోసం, నొప్పులు భరించలేమని సిజేరియన్‌కు మొగ్గు చూపుతున్న వారి ఆరోగ్యానికి కలిగే నష్టాలను తెలుపుతున్నారు.
- ప్రైవేటు ఆస్పత్రుల్లో సిజేరియన్ ప్రసవాలపై ప్రత్యేక నిఘా పెట్టారు. అమలాపురం గాంధీనగర్ వద్ద ఒక ప్రైవేటు ఆస్పత్రితో పాటు రామచంద్రపురం, మండపేటల్లోని మూడు నాలుగు ఆస్పత్రుల్లో సిజేరియన్లు ఎక్కువగా జరుగుతున్నాయని గుర్తించారు. వాటి యాజమాన్యలకు కౌన్సెలింగ్ ఇచ్చారు. జిల్లాలోని రెండు సీహెచ్‌సీల్లో సైతం అధికంగా సిజేరియన్లు జరుగుతున్నట్లు గుర్తించిన అధికారులు.. అక్కడి వైద్యులకు కూడా కౌన్సెలింగ్ చేశారు.

సాధారణ ప్రసవాలే మేలు



సాధారణ ప్రసవాల వల్ల తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉంటారు. సిజేరియన్ వల్ల బిడ్డకు పాల కొరత రావడంతో పాటు రకరకాల సైడ్ ఎఫెక్ట్స్ వస్తాయి. ఈ విషయాన్ని గర్భిణులకు చెబుతున్నాం. అలాగే ప్రైవేటు ఆస్పత్రులపై నిఘా పెంచాం.

– డాక్టర్ టీకే శ్రీనివాసరావు, అదనపు జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి

గత ఏడాది ఏప్రిల్ నుంచి అక్టోబర్ నెలాఖరు వరకూ ప్రసవాల వివరాలు

ఆస్పత్రులు	సాధారణం ప్రసవాలు	సిజేరియన్ ప్రసవాలు	మొత్తం ప్రసవాలు	సాధారణ ప్రసవాల శాతం	సిజేరియన్ శాతం
ప్రభుత్వం	1,694	2,041	3,735	45	55
ప్రైవేటు	1,386	7,813	9,199	15	85
మొత్తం	3,427	9,507	12,934	26	74
గత ఏడాది నవంబర్ 1 నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి నెలాఖరు వరకూ..					
ప్రభుత్వం	505	48	553	91	9
ప్రైవేటు	2,304	4,313	6,617	34	66
మొత్తం	2,809	4,361	7,170	39	61

31 నుంచి బిజినెస్ వుమెన్ ఎక్స్‌పో



బిజినెస్ వుమెన్ ఎక్స్‌పో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శుక్లా

అమలాపురం రూరల్: ఈ నెల 31 నుంచి ఏప్రిల్ 9వ తేదీ వరకూ బిజినెస్ వుమెన్ ఎక్స్‌పో పేరిట 'మినీ సరస్ డ్వాక్రా బజార్' నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. స్వయం సహాయక సంఘాల్లో నైపుణ్యం కలిగిన మహిళలు రూపొందించిన ఉత్పత్తులతో కూడిన ఈ ప్రదర్శనను జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ ఎగ్జిబిషన్ ప్రచారానికి సంబంధించిన బ్రోచర్, ఆడియో, వీడియో సీడీలను ఆయన మంగళవారం తన చాంబర్‌లో ఆవిష్కరించారు. స్థానిక జీఎంసీ బాలయోగి స్టేడియం ప్రాంగణంలో ఈ నెల 31వ తేదీ సాయంత్రం ఈ ఎక్స్‌పో ప్రారంభమవుతుందన్నారు. ఇందులో చేనేత వస్త్రాలు, హస్తకళా వస్తువులు, నోరూరించే కోనసీమ వంటకాలు, వివిధ జిల్లాల్లో నైపుణ్యం కలిగిన మహిళా స్వయం సహాయక సంఘాల్లోని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు తయారు చేసిన ఉత్పత్తులతో సుమారు 100 స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. రోజూ ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకూ దీనిని నిర్వహిస్తారన్నారు. ఈ ఎక్స్‌పోను ప్రజలు సందర్శించి, నచ్చిన ఉత్పత్తులు కొనుగోలు చేసి, మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ సీహెచ్ సత్తిబాబు, నాబార్డ్ ఏజీఎం స్వామినాయుడు, డీఆర్‌డీఏ పీడీ పి.శివశంకర్ ప్రసాద్, ఏపీడీ ఎంఎం జిలానీ, ఎల్‌డీఎం లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

- రాష్ట్ర అగ్రి మిషన్ వైస్ చైర్మన్ నాగిరెడ్డి
- వివిధ ప్రాంతాల్లో పర్యటన.. అధికారులతో చర్చ

సాక్షి, అమలాపురం: జిల్లాలో సముద్ర మొగ ద్వారా ఎదురవుతున్న ముంపు సమస్య పరిష్కారం, ఏటిగట్ల బలోపేతం, పంట కాలువలు, మురుగునీటి కాలువల్లో గుర్రపు డెక్క, తూడు తొలగింపు సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని ఏపీ స్టేట్ అగ్రికల్చర్ మిషన్ వైస్ చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి తెలిపారు. ఈ విషయాలపై కలెక్టర్ హిమాన్షు శుక్లాతో చర్చించామని చెప్పారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో మంగళవారం పర్యటించిన ఆయన అమలాపురంలో కలెక్టర్ శుక్లా, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతో చర్చించారు. కోనసీమ రైతుల సమస్యలు, గోదావరి డెల్టా ఆధునీకరణ ప్రతిపాదనలను, జిల్లా యంత్రాంగం తీసుకున్న చర్యలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ శుక్లా వివరించారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి విలేకర్లతో మాట్లాడారు. వివిధ కార్పొరేట్ సంస్థల సామాజిక బాధ్యత నిధులతో గోదావరి డెల్టాలో ఒక్క ఎకరా కూడా ఎండిపోకుండా చర్యలు తీసుకోవడం అభినందనీయమని అన్నారు. ‘దివంగత వైఎస్సార్‌కు, ప్రస్తుత సీఎం జగన్‌కు ప్రకృతితో చుట్టరికం ఉంది. దీనివల్ల రబీకి ఎటువంటి ఇబ్బందీ రాకుండా ఉందని, దిగుబడులు ఆశాజనకంగా వస్తాయని చెప్పారు. అవుట్‌ఫాల్ స్లూయిజ్ మరమ్మతు పనులు 25 వరకూ చేపట్టారని, 15 పనులు పురోగతిలో ఉన్నాయని వివరించారు. గోదావరి డెల్టాకు రబీ సీజన్‌లో సాగునీటి ఎద్దడి సమస్యలు ఉత్పన్నమవుతాయని, దీనిని దృష్టిలో ఉంచుకునే నాడు దివంగత వైఎస్సార్ పోలవరం ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. పోలవరం పూర్తయి, రిజర్వాయర్‌లో నీటి నిల్వలు ఉంటే ఇప్పుడు ఈ తరహా సాగునీటి ఎద్దడి సమస్యలు ఉత్పన్నమయ్యేవి కావని నాగిరెడ్డి స్పష్టం చేశారు. అంతకు ముందు ఆయన స్థానిక డీసీసీబీ బ్రాంచి కార్యాలయాన్ని పరిశీలించారు. బ్యాంకు రుణ పరపతి, రుణాల కల్పనపై బ్యాంక్ అధికారులతో సమీక్షించారు. అగ్రికల్చర్ మిషన్ సభ్యుడు జిన్నూరి రామారావు (బాబి), వైఎస్సార్ సీపీ రైతు విభాగం రీజినల్ కార్యదర్శి కె.త్రినాథ్‌రెడ్డి, గోదావరి డెల్టా ప్రాజెక్టు కమిటీ మాజీ వైస్ చైర్మన్ సత్తి శ్రీనివాస్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



రైతు సమస్యలపై కలెక్టర్ శుక్లాతో చర్చిస్తున్న నాగిరెడ్డి

అద్దాల మండపం ప్రారంభం



శేషవాహనానికి ఈఓ కృష్ణచైతన్య ప్రత్యేక పూజలు

ఆత్రేయపురం: ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి ఆలయంలో దాత విరాళంతో అద్దాల మండపం నిర్మించినట్టు ఈఓ బి.కృష్ణచైతన్య తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన పాపన్నశర్మ, విమల రూ.1.50 లక్షల విరాళంతో నిర్మించిన ఈ మండపాన్ని ఈఓ మంగళవారం ప్రారంభించారు. అలాగే ఈతకోటకు చెందిన కొంపెల్ల రాంబాబు, శైలజ రూ.70 వేల విలువైన 37 కేజీల ఇత్తడి శేషవాహనాన్ని స్వామి వారికి సమర్పించారు. సంప్రోక్షణ, హోమం, శాంతి కల్యాణం అనంతరం నూతన శేష వాహనంపై స్వామి వారి ప్రదక్షిణలు నిర్వహించారు. దాతలను సత్కరించారు.

అల్లర్ల కేసుల ఎత్తివేత నిర్ణయంపై హర్షాతిరేకాలు

- తాడేపల్లికి తరలివెళ్లిన కాపు, శెట్టిబలిజ నేతలు
- విద్యార్థులు, యువకుల భవిష్యత్‌కోసమేనన్న మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్యే పొన్నాడ
- సీఎం జగన్‌కు కృతజ్ఞతలు

అమలాపురం టౌన్: అమలాపురం అల్లర్లకు సంబంధించిన కేసుల ఉపసంహరణకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ఈ ప్రాంతానికి చెందిన కాపు, శెట్టిబలిజ నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కోనసీమ జిల్లాకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేరు పెట్టిన అనంతరం గత ఏడాది మే నెలలో జిల్లా కేంద్రం అమలాపురంలో అల్లర్లు చోటు చేసుకున్న విషయం తెలిసిందే. ఈ అల్లర్ల అభియోగాలపై ఇప్పటికే 258 మంది అరెస్ట్ అయి, బెయిల్ పొందారు. మరికొంతమందిని అరెస్ట్ చేయాల్సి ఉంది. ఈ తరుణంలో ఈ కేసుల నుంచి త్వరలో విముక్తి పొందనున్నామని వీరందరూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ కేసుల ఎత్తివేతకు సాక్షాత్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకోవడంపై వీరు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తాడేపల్లిలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, ఎమ్మెల్సీలు తోట త్రిమూర్తులు, కుడుపూడి సూర్యనారాయణరావు, కోనసీమకు చెందిన కాపు, శెట్టిబలిజ నేతలతో మంగళవారం చర్చలు జరిగాయి. అనంతరం ఈ కేసుల ఎత్తివేత ప్రకటన చేయడాన్ని ఆ రెండు సామాజిక వర్గాలూ స్వాగతిస్తున్నాయి. కక్షలు, కేసులు శాశ్వతం కాదని, అన్ని కులాలు, వర్గాల వారు కలిసి ఉండటమే ముఖ్యమని ఈ సందర్భంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చెప్పడంపై చర్చలకు వెళ్లిన ప్రజాప్రతినిధులు, ఆ సామాజిక వర్గాల నేతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు. ఆస్తుల పరంగా తాము నష్టపోయినా, ఈ అల్లర్ల కేసులలో ఎక్కువగా విద్యార్థులు, యువకులు ఇరుక్కున్నారని.. వారి భవిష్యత్ దృష్ట్యా కేసుల ఎత్తివేతపై సానుకూలత వ్యక్తం చేశామని మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్యే సతీష్‌కుమార్ ‘సాక్షి’కి తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, పార్టీ నిర్ణయమే తమ నిర్ణయంగా భావించి ఎత్తివేతను స్వాగతిస్తున్నామని చెప్పారు. సీఎంతో చర్చల్లో పాల్గొన్న కోనసీమకు చెందిన శెట్టిబలిజ నేతలు రాష్ట్ర దృశ్య కళల అకాడమీ చైర్‌పర్సన్ కుడుపూడి సత్య శైలజ, అమలాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, చెల్లుబోయిన శ్రీనివాసరావు, సంసాని బులినాని, మట్టపర్తి నాగేంద్ర, కుడుపూడి బాబు, ఇళ్ల శేషగిరిరావు, వాసంశెట్టి తాతాజీ, మట్టపర్తి మీరాసాహెబ్ శెట్టి, గుత్తుల శ్రీను, చిట్టూరి పెదబాబు, గొవ్వాల రాజేష్, బొక్కా ఆదినారాయణ, కుడుపూడి భరత్ భూషణ్, బొంతు గోవింద శెట్టి, కాపు నేతలు దంగేటి రాంబాబు, వంటెద్దు వెంకన్నాయుడు, జిన్నూరి వెంకటేశ్వరరావు, మోటూరి సాయి, బద్రి బాబ్జీ, కొల్లాటి దుర్గాబాయి, సుంకర సుధ, నూదా గణపతి, అడపా బాబులు, మెరికల శ్రీను, దంగేటి దొరబాబు కేసుల ఎత్తివేత నిర్ణయాన్ని స్వాగతించి, హర్షం వ్యక్తం చేశారు.

అందాల స్వామికి.. కల్యాణ వేడుక

- రేపు జగన్మోహినీ కేశవస్వామి వారి పరిణయం
- వచ్చే నెల 6వ తేదీ వరకూ ఉత్సవాలు
- ముస్తాబైన ర్యాలి పుణ్యక్షేత్రం



ర్యాలి గ్రామంలోని జగన్మోహినీ కేశ్వస్వామి వారి ఆలయం

ఆత్రేయపురం: జగత్తులోని సౌందర్యాన్నంతటినీ పోత పోసినట్టు.. మిసమిసలాడుతూ దర్శనమిచ్చే నునుపైన సాలగ్రామ శిలావిగ్రహం.. ముందు పురుషాకృతి.. వెనుక భాగాన స్త్రీ రూపం.. ఇటువంటి ఏకశిలా మూర్తిగా.. స్వయంభువుగా వెలసిన వేలుపు జగన్మోహినీ కేశవస్వామి. ఈ స్వామిని దర్శిస్తే సమస్త పాపాలూ హరిస్తాయని భక్తుల విశ్వాసం. ఈ అందాల స్వామి కల్యాణ వేడుకకు సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం ర్యాలి గ్రామం ముస్తాబవుతోంది. ఈ నెల 30వ తేదీ నుంచి వచ్చే నెల 6 వరకూ స్వామి వారి కల్యాణోత్సవాలు నిర్వహించనున్నారు. ఇందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు.

అడుగడుగునా అద్భుతాలే..

- ఇక్కడ స్వామివారి సౌందర్యాన్ని వర్ణించనలవి కాదు. స్వయంగా చూసి తీరవలసిందే అన్నట్టుగా ఉంటుంది.
- ఈ ఆలయంలో జగన్మోహినీ కేశవస్వామి ఐదడుగుల సాలగ్రామ ఏకశిలా మూర్తిగా దర్శనమిస్తారు. ముందు కేశవస్వామి, వెనుక భాగంలో జగన్మోహినిగా స్త్రీ రూపంలో అవతరించారు. స్త్రీమూర్తి కొప్పున శిఖ చుట్టుకున్నట్టు.. అందులో చామంతి పుష్పం.. అప్పుడే సంపంగి నూనె రాసినట్టు అందంగా, ఒద్దికగా తీర్చిదిద్దిన కురులు.. దండకడియాలు.. కచ్చా పోసిన రీతిలో చీరకట్టు.. పద్మినీ జాతి స్త్రీలకు శుభసూచకమని భావించేలా కుడికాలి తొడపై తెల్లగా, పొడవుగా పుట్టుమచ్చ.. కాళ్లకు అందెలు, గజ్జెలు దర్శనమిస్తాయి.
- ఈ శిలా విగ్రహంలో కిరీటం; మకర కుండలాలు; కర్ణపత్రాలు; కంఠంపై త్రివళులు (ముడుతలు); కౌస్తుభ మణిహారాలు; జపమాల; యజ్ఞోపవీతం; స్ఫుటంగా సొగసైన నాభిస్థానం; ఉత్తరీయం; శంఖం, చక్రం, గద పట్టుకున్న హస్తాలు; చేతివేళ్లకు ఉంగరాలు; అందంగా కొనదేలిన గోళ్లు; అభయ హస్తం, దానిపై రేఖలు సైతం ఎంతో అద్భుతంగా దర్శనమిస్తాయి.
- ఇంకా స్వామి వారి దేవేరులు శ్రీదేవి, భూదేవి.. స్వామి పాదాల చెంతనే సేవ చేసుకుంటున్న గరుత్మంతుడిని ఇక్కడ దర్శించవచ్చు. స్వామి వారి రెండు పాదాల మధ్యన పద్మాసనంలో గంగాదేవి కొలువుదీరింది. ఆమె తన పవిత్ర జలాలతో స్వామివారి రెండు పాదాలనూ నిరంతరం కడుగుతున్నట్టుగా దర్శనమిస్తుంది.
- స్వామి వారి ఉభయ పార్శ్వాల్లో పొన్నచెట్టు, గోవర్ధన గిరి ఎత్తిన శ్రీకృష్ణభగవానుడు, మకరతోరణం రీతి, దశావతారాలు, గానం చేస్తున్న తుంబుర నారదులు, స్వామివారికి పుష్పమాలలు వేస్తున్న కిన్నెర, కింపురుషాదులు, నృత్య భంగిమల్లో రంభ, ఊర్వశి అప్సరసలు, పడగ విప్పిన ఆదిశేషుడు దర్శనమిస్తారు.
- ఈ ఆలయ నిర్మాణం 11వ శతాబ్దంలో తూర్పు చాళుక్య రాజు రాజరాజనరేంద్రుని కాలంలో జరిగింది. ప్రపంచవ్యాప్తంగానే ఇటువంటి దేవాలయం లేదని చెబుతారు. ఈ స్వామి దర్శనం భక్తులను తన్మయత్వంలో ఓలలాడిస్తుంది.
- జగన్మోహినీ కేశవస్వామి ఆలయానికి ఎదురుగా పడమర వైపు శ్రీ ఉమా కమండలేశ్వరస్వామి ఆలయం ఉంది. ఇది కూడా అద్భుత దేవాలయం. ఈశ్వరునిపై అభిషేకం చేసిన జలాలు పానపట్టంలోనే ఇంకిపోవడం ఇక్కడి ప్రత్యేకత. అందువలన ఈ ఆలయంలో అభిషేక జలాలు బయటకు వచ్చే సోమసూత్రంతో పాటు చండీశ్వరుని విగ్రహం కూడా ఉండవు.
- ఆలయంలో ఎత్తయిన పురాతన గాలిగోపురం, గర్భగుడి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్ల విగ్రహాలు భక్తులను తన్మయుల్ని చేస్తాయి.
- ఆలయ గర్భగుడి ప్రాంగణంలో అత్యంత లోతైన సొరంగ మార్గం ఉంది. ఇది పూర్వం ఉపయోగించే వారని అంటారు.



స్వామి వారి ముందు (పురుష), వెనుక (స్త్రీ) రూపాలు



స్వామి వారి పాదాల చెంత ఉద్భవిస్తున్న గంగమ్మ

కల్యాణోత్సవాల క్రమమిదీ..

- ఈ నెల 30: ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం గరుడ వాహన సేవ, రాత్రి 8 గంటలకు కల్యాణోత్సవం.
- ఏప్రిల్ 3: పండిత సదస్యం
- 5: చక్రస్నానం
- 6: శ్రీపుష్పోత్సవం

క్షీరసాగర మధనానంతరం..

క్షీరసాగర మధన సమయంలో శ్రీ మహావిష్ణువు జగన్మోహినిగా అవతారంలో దేవదానవులకు అమృతం పంచి పెట్టి రథంపై వస్తున్నారట. గౌతమి – వశిష్ఠ గోదావరి పాయల మధ్య ప్రాంతంలోని రత్నాపురం గ్రామం వద్ద ఆయన రథం శీల (ఇరుసు) రాలి పడిందట. వెనుతిరిగి చూసేసరికి, అపూర్వ సౌందర్యరాశిగా ఉన్న తన జగన్మోహినీ అవతారం చూసి, మోహితుడైన పరమ శివుడు తనను వెంబడిస్తున్నట్టు గమనించారట. దీంతో ఆయనను ఆపేందుకు నిజ రూపంతో ముందు పురుష, వెనుక స్త్రీ రూపంలో జగన్మోహినీ కేశవస్వామిగా సాలగ్రామ శిలారూపంలో.. ఇక్కడ వెలిశారని స్థల పురాణం చెబుతుంది. అంతే కాదు.. జగన్మోహినీ అవతారం విష్ణుమాయ అని గ్రహించిన శివుడు సిగ్గుపడి.. కేశవస్వామికి ఎదురుగా ఉమా కమండలేశ్వరునిగా అవతరించారట. రథం శీల రాలి పడిన గ్రామం కనుక నాటి రత్నాపురం కాస్తా.. నేడు ర్యాలిగా పేరొందింది.

భస్మాసుర వధతో ముడి పడిన మరో కథ

భస్మాసురుడిని అంతమొందించే సమయంలో కూడా శ్రీమన్నారాయణుడు మోహినీ అవతారం ఎత్తారు. ఆమె సౌందర్యాన్ని చూడాలనే కుతూహలంతో పరమేశ్వరుడు ఆమెను వెంబడిస్తూ రత్నాపురం గ్రామానికి చేరాడని, ఇక్కడే శ్రీమహావిష్ణువు మోహినీ రూపాన్ని వీడి.. పరమ శివుని ఎదుట జగన్మోహినీ కేశవస్వామిగా సాక్షాత్కరించారని చెబుతారు. నిజం గ్రహించిన శివుడు ఇక్కడ ఉమా కమండలేశ్వరునిగా ఆవిర్భవించారని అంటారు.

భక్త విక్రమ దేవుని స్వప్నం

పూర్వం ఈ ప్రాంతం దట్టమైన అరణ్యంగా ఉండేది. విక్రమ దేవుడు అనే భక్తుడు ఈ ప్రాంతంలో వేట సాగిస్తూ ఒక చెట్టు వద్ద నిద్రించాడు. అతడికి శ్రీమహావిష్ణువు కలలో కనబడి, స్వయంభూ శిలా రూపంలో తాను ఆ ప్రాంతంలో ఉన్నానని, కర్రతో రథం చేయించి లాక్కొని వెళ్తే.. ఆ రథం శీల రాలి పడుతుందని, అక్కడ తవ్వితే తన విగ్రహం బయట పడుతుందని చెప్పి అదృశ్యమయ్యారని అంటారు. ఆ ప్రకారమే విక్రమ దేవుని ద్వారా ఈ విగ్రహం బయట పడిందని ఆలయ చరిత్ర చెబుతోంది.

ఏర్పాట్లు పూర్తి



శ్రీ జగన్మోహినీ కేశవస్వామి వారి కల్యాణోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశాం. వీటికి అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తారు. అందుకు తగినట్టుగా సౌకర్యాలు కల్పించాం.

– కృష్ణచైతన్య, కార్యనిర్వహణాధికారి, ర్యాలి దేవస్థానం

క్లుప్తంగా

జగన్‌ను మరోసారి సీఎంగా చేసుకుందాం

జనసేన సర్పంచ్ కాకర శ్రీనివాస్



సభలో మాట్లాడుతున్న జనసేన సర్పంచ్ కాకర శ్రీనివాస్

మలికిపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా చేసుకుందామని జనసేన పార్టీకి చెందిన రామరాజులంక గ్రామ సర్పంచ్ కాకర శ్రీనివాస్ అన్నారు. కత్తిమండలోని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు క్యాంపు కార్యాలయం వద్ద మంగళవారం వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీనివాస్ ప్రసంగిస్తూ, రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్ అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు పేదరికం రూపు మాపే విధంగా, పేద కుటుంబాలకు ఎంతో అండగా, ఆసరాగా ఉంటున్నాయని అన్నారు. ఇటువంటి ముఖ్యమంత్రి దేశంలోనే ఎక్కడా లేరని కొనియాడారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాల అమలు దేశంలో ఎక్కడా లేదని అన్నారు. కుల మత రాజకీయాలకు అతీతంగా ప్రజారంజక పాలన అందిస్తున్న జగన్ లాంటి ముఖ్యమంత్రిని అందరం కాపాడుకోవాలని, మళ్లీ ముఖ్యమంత్రిగా కొనసాగేలా కృషి చేద్దామని అన్నారు.

మోసం చేసిన 11 మందిపై కేసు

అయినవిల్లి: ఇటుక బట్టీలో పని చేస్తామని యజమాని వద్ద రూ.4.70 లక్షల అడ్వాన్సు తీసుకుని, మోసగించిన 11 మందిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్.నాగేశ్వరరావు తెలిపారు. అయినవిల్లి మండలం అయినవిల్లిలంక గ్రామానికి చెందిన ముళ్లపూడి జనార్దనరావు వద్ద ఇటుక బట్టీలో పనిచేస్తామని చెప్పి, పిఠాపురానికి చెందిన కుమ్మరి రాంబాబు, మరో పది మంది రూ.4.70 లక్షలు తీసుకుని మోసగించారని ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగేశ్వరరావు తెలిపారు.


రాముని కల్యాణానికి బొండాలు, తలంబ్రాలు సిద్ధం



కల్యాణోత్సవానికి సిద్ధమైన కొబ్బరి బొండాలు



రామనామాలు రాసిన బియ్యపు గింజలు



రామ నామం రాసిన తలంబ్రాలు

పెదపూడి: జి.మామిడాడ శ్రీ కోదండ రామాలయంలో గురువారం జరిగే సీతా రాముల కల్యాణోత్సవానికి ప్రత్యేకంగా తయారు చేసిన కొబ్బరి బొండాలు, బియ్యపు గింజలపై మూడు భాషల్లో 'రామ' అని రాసిన తలంబ్రాలు సిద్ధమయ్యాయి. జి.మామిడాడకు చెందిన వ్యాయామోపాధ్యాయుడు, సూక్ష్మ కళాకారుడు ద్వారంపూడి యువరాజారెడ్డి, సంధ్య డెకరేషన్స్ అధినేత ద్వారంపూడి సంధ్య వీటిని తయారు చేశారు. కల్యాణ కొబ్బరి బొండాలపై రంగు రంగుల పొడులు, ముత్యాలు, లేసుల సహాయంతో శంఖు, చక్ర, నామాలు, రాముడు, సీత పేర్లను సుందరంగా తీర్చిదిద్దారు. అలాగే లక్ష బియ్యపు గింజలపై ఎటువంటి సూక్ష్మ పరికరాలూ వినియోగించకుండా పెన్నుతో తెలుగు, ఇంగ్లిషు, హిందీ భాషల్లో 'రామ' నామం రాశారు. 14 ఏళ్ల నుంచి 6 లక్షలకు పైగా బియ్యపు గింజలపై మూడు భాషల్లో 'రామ' నామం రాశానని యువరాజారెడ్డి చెప్పారు.

సీతమ్మకు చేయిస్తి.. చిత్రాల సారెను..



కోవాతో చేసిన వివిధ రకాల స్వీట్లు

- భక్తులను ఆకట్టుకుంటున్న 'కోవా' కంత
- సీతారాముల కల్యాణం సందర్భంగా సీతమ్మవారికి సమర్పణ
- 20 రోజులుగా తయారీ

పి.గన్నవరం: 'సీతమ్మకు చేయిస్తి.. చింతాకు పతకము..' అంటూ అలనాడు భక్త రామదాసు పాడుకున్నాడు. అదేవిధంగా సీతమ్మ వారికి చిత్రమైన సారెను సమర్పిస్తున్నారు ఆ భక్త దంపతులు. స్థానిక పాత అక్విడెక్టు వద్ద శ్రీ పట్టాభి రామాలయంలో ఈ నెల 30న జరగనున్న సీతారాముల కల్యాణ మహోత్సవాలకు ఆలయ ధర్మకర్తలు పేరిచర్ల భీమరాజు, సత్యవాణి దంపతులు 20 రోజులుగా కోవాతో వివిధ రకాల స్వీట్లతో సారె తయారు చేయిస్తున్నారు. కల్యాణ మహోత్సవంలో శ్రీరాముని తరపున సీతమ్మ వారికి ఈ సారె (కంత) సమర్పించి తమ భక్తిని చాటుకుంటున్నారు. వివిధ రకాల ఫలాలు, పుష్పాలు, కూరగాయలు, పంచె, చీర, పర్ణశాల తదితర ఆకృతుల్లో కోవాతో తయారు చేస్తున్న ఈ స్వీట్లు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. కోవా స్వీట్లతో పాటు ఇతర పిండి వంటలను సిద్ధం చేస్తున్నారు. 'ఇంటికో పువ్వు.. ఈశ్వరునికో మాల' అన్నట్టుగా.. సారె తయారీలో స్థానిక మహిళా భక్తులు కూడా తమవంతు సేవలు అందిస్తున్నారు.



కోవాతో పర్ణశాలను చేస్తున్న మహిళా భక్తులు

14 ఏళ్లుగా..



సీతారాముల కల్యాణోత్సవం సందర్భంగా కోవాతో వివిధ రకాల ఆకృతుల్లో స్వీట్లు, ఇతర పిండి వంటలు తయారు చేస్తున్నాం. మొత్తం 108 రకాలతో ఈ సారె సిద్ధం చేస్తున్నాం. 14 ఏళ్లుగా ఈ ఆనవాయితీ కొనసాగిస్తున్నాం. ఏటా సీతారాముల సేవలో పాల్గొనే అవకాశం కలగడం అదృష్టంగా భావిస్తున్నాం. – పేరిచర్ల సత్యవాణి, పి.గన్నవరం

గుళికలు తిని వృద్ధురాలి మృతి

పి.గన్నవరం: వరిచేలకు వినియోగించే గుళికలు తిని ఒక వృద్ధురాలు మృతి చెందింది. పోలీసుల కథనం ప్రకారం.. పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట మండలం కోడేరులంకకు చెందిన వాతాడి లక్ష్మి (70) ఇటీవల ఎల్.గన్నవరంలోని కుమార్తె బి.రత్నకుమారి ఇంటికి వచ్చింది. సోమవారం సాయంత్రం గుళికలు తిని అపస్మారక స్థితికి చేరుకుంది. అమలాపురం ఏరియా ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. కుమార్తె రత్నకుమారి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

భద్రాచలానికి ప్రత్యేక బస్సులు

అమలాపురం రూరల్: శ్రీరామ నవమి పర్వదినం సందర్భంగా భద్రాచలానికి అమలాపురం నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతోంది. స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణమూర్తి మంగళవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. అమలాపురం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి బుధవారం ఉదయం 7 నుంచి రాత్రి 9 గంటల వరకూ భద్రాచలానికి ప్రత్యేక బస్సులు నడుపుతున్నామన్నారు. వీటికి ఆన్‌లైన్ రిజర్వేషన్ సదుపాయం కల్పించామని పేర్కొన్నారు. అడ్వాన్స్‌డ్ రిజర్వేషన్ల కోసం 9959 2255 76, 9959 22 5550 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. అవసరమైతే రద్దీకి అనుగుణంగా భద్రాచలానికి అదనపు బస్సులు నడుపుతామని సత్యనారాయణమూర్తి తెలిపారు.

ఫస్టియర్ పరీక్షలకు 12,770 మంది హాజరు

రాయవరం: ఇంటర్మీడియెట్ ఫస్టియర్ కెమిస్ట్రీ, కామర్స్ పరీక్షలకు మంగళవారం జిల్లా వ్యాప్తంగా 12,770 మంది హాజరయ్యారు. మొత్తం 13,607 మంది హాజరు కావాల్సి ఉండగా, 837 మంది గైర్హాజరయ్యారు. జనరల్ విభాగంలో 11,735 మందికి గాను 11,203 మంది పరీక్ష రాశారు. 532 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 1,872 మందికి గాను 1,567 మంది హాజరయ్యారు. 305 మంది పరీక్ష రాయలేదని ఇంటర్మీడియెట్ బోర్డు డీవీఈఓ ఎస్‌వీవీ సత్యనారాయణరెడ్డి తెలిపారు.

పోస్టల్ నిధుల గోల్‌మాల్‌పై సీబీఐ విచారణ

- సస్పెండైన ఇద్దరు ఉద్యోగులను ప్రశ్నించిన అధికారులు
- రూ.1.18 కోట్ల ఐపీపీబీ నిధుల దుర్వినియోగంపై దర్యాప్తు ముమ్మరం
- అజ్ఞాతంలో ఉన్న సూత్రధారి కదలికలపై ఆరా

అమలాపురం టౌన్: అయినవిల్లి మండలం విలస సబ్ పోస్టాఫీస్ ద్వారా ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్(ఐపీపీబీ)లో జరిగిన రూ.1.18 కోట్ల గోల్‌మాల్‌పై సీబీఐ అధికారులు మంగళవారం విచారణ నిర్వహించారు. విశాఖపట్నం సీబీఐ కార్యాలయం నుంచి ఇద్దరు అధికారులు ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయే వరకూ ఈ విచారణ సాగించారు. తొలుత వారు పోస్టల్ సూపరింటెండెంట్ ఎస్.శ్రీధర్‌తో భేటీ అయ్యారు. నిధుల దుర్వినియోగంపై నమోదైన కేసులోని నిందితుల సమగ్ర సమాచారం సేకరించారు. గత ఏడాది మే నెల మొదటి వారంలో జరిగిన నిధుల గోల్‌మాల్‌పై శాఖాపరంగా జరిగిన ప్రాథమిక విచారణలో పర్యవేక్షణ లోపానికి బాధ్యులుగా గుర్తించి పోస్టల్ అసిస్టెంట్లు మంగతాయారు, మహాలక్ష్మిలను సస్పెండ్ చేశారు. ఎనిమిది మంది ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు ఇచ్చారు. ఈ నిధుల గోల్‌మాల్‌కు సూత్రధారిగా అమలాపురం హెడ్ పోస్టాఫీసులో సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్‌గా పని చేసిన సతీష్‌ను గుర్తించారు. అయితే నిధుల దుర్వినియోగం వెలుగు చూడగానే అతడు అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. విచారణకు వచ్చిన సీబీఐ అధికారులు సస్పెండైన మంగతాయారు, మహాలక్ష్మిలను ఉదయం నుంచి రాత్రి వరకూ విచారించారు. ఈ కేసుకు సంబంధించిన ఐపీపీబీ రికార్డులను పరిశీలించారు. సమగ్ర సమాచారం సేకరించారు. సీబీఐ అధికారుల విచారణ బుధ, గురువారాల్లో కూడా కొనసాగుతుందని తెలిసింది. నిధుల దుర్వినియోగంలో షోకాజ్ నోటీసులు అందుకున్న ఎనిమిది మంది పోస్టల్ ఉద్యోగులను బుధవారం విచారించనున్నారని సమాచారం.

సూత్రధారిపై ఆరా

ఈ నిధుల దుర్వినియోగానికి సూత్రధారి అయిన సతీష్ పాత్రపై సీబీఐ అధికారులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. నిధుల గోల్‌మాల్ బాగోతం వెలుగులోకి వచ్చినప్పటి నుంచీ అజ్ఞాతంలో ఉన్న సతీష్ కదలికలపై వారు ఆరా తీస్తున్నారు. రెండు నెలల కిందట హెడ్ పోస్టాఫీసులో జరిగిన శాఖా పరమైన విచారణకు సతీష్ తన తండ్రితో హాజరయ్యాడు. అప్పట్లో సస్పెండైన, షోకాజ్ నోటీసులు అందుకున్న ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు కార్యాలయానికి వచ్చి సతీష్‌ను నిలదీశారు. ఈ నేపథ్యంలో అతడు కార్యాలయం పై అంతస్తు ఎక్కి ఆత్మహత్యకు ఆడిన నాటకీయ పరిణామాలు, అతడిని పోలీసులు అదుపులోకి తీసుకోవడం వంటి పరిణామాలు తెలిసిందే. నేటికీ అజ్ఞాతంలో ఉన్న సతీష్‌ను కూడా సీబీఐ అధికారులు ఏదో ఒకలా రప్పించి బుధ, గురువారాల్లో విచారించే అవకాశాలున్నాయని పోస్టల్ సిబ్బంది చెబుతున్నారు.

క్రైం కార్నర్..

పరీక్షలకు వెళ్లి విద్యార్థిని అదృశ్యం



విద్యార్థిని తల్లిదండ్రుల నుంచి వివరాలు సేకరిస్తున్న పోలీసులు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చేబ్రోలుకు చెందిన ఒక ఇంటర్మీడియెట్ విద్యార్థిని పరీక్షలు రాయడానికని వెళ్లి అదృశ్యమైంది. పోలీసుల కథనం ప్రకారం.. ఆ విద్యార్థిని చేబ్రోలు ఎస్సీ హాస్టల్‌లో ఉంటూ స్థానిక జూనియర్ కాలేజీలో ఇంటర్ చదువుతోంది. మంగళవారం ఉదయం ఇంటర్ పరీక్షలు రాయడానికని ఆటోలో పిఠాపురం వెళ్లింది. సాయంత్రం అవుతున్నా ఆమె తిరిగి రాలేదు. ఎంత వెతికినా ఆమె ఆచూకీ తెలియకపోవడంతో తల్లిదండ్రులు గొల్లప్రోలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై వినయ్‌ప్రతాప్ తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని, విచారణ ప్రారంభించారు. విద్యార్థిని పరీక్షలు రాయడానికి వెళ్లిన ఆటో డ్రైవర్‌ను విచారించగా.. పరీక్షలకు తీసుకువెళ్లి, తరువాత ఇంటికి తీసుకువచ్చి దింపేశానని చెప్పాడు. ఆమె ఆచూకీ కోసం పిఠాపురం సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ తన సిబ్బందితో ప్రయత్నం ఆరంభించారు. ఆమె స్నేహితులను విచారిస్తున్నారు.

గోదావరిలో వ్యక్తి మృతదేహం లభ్యం

కొవ్వూరు: పట్టణంలోని హిందూ శ్మశాన వాటిక సమీపాన గోదావరి నదిలో ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మృతుడిని ఎన్‌టీఆర్ జిల్లా జి.కొండూరు మండలం వెలటూరు గ్రామానికి చెందిన చింతపల్లి రవికుమార్(34)గా గుర్తించారు. ఇతడు ఛార్మ్స్ సిగరెట్స్ కంపెనీలో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పని చేస్తున్నాడు. తరచూ రాజమహేంద్రవరంలో నిర్వహించే కంపెనీ సమావేశాలకు వస్తూంటారు. ఈ నెల 26వ తేదీన ఇంటి నుంచి వచ్చిన రవికుమార్ అదే రోజు భార్యకు ఫోన్ చేసి తాను బయటకు వచ్చానని, ఇంటికి వస్తాను కంగారు పడవద్దని ఫోన్ చేశాడు. అనంతరం అతడి ఫోన్ స్విచాఫ్ అయ్యింది. అతడి కోసం గాలిస్తూండగా గోదావరి నదిలో మృతదేహం కనిపించిందని బావమరిది పత్తాల కుమారబాబు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్సై బి.దుర్గాప్రసాద్ తెలిపారు. మృతదేహాన్ని వెలికి తీసి, పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

డిగ్రీ కళాశాల లైబ్రరీకి రూ.19.87 లక్షల విరాళం

మండపేట: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో లైబ్రరీ హాలు నిర్మాణానికి స్థానిక మాధవి ఎడిబుల్ ఆయిల్స్ సంస్థ యాజమాన్యం ముందుకొచ్చింది. వేగుళ్ల సూర్యారావు చారిటబుల్ ట్రస్టు ద్వారా మాధవి ఎడిబుల్ ఆయిల్స్ అధినేత వీవీవీఎస్ చౌదరి (మాధవిబాబు), సంస్థ ఈడీ, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ పరిశీలకుడు వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి, డైరెక్టర్, వైఎస్సార్ సీపీ నేత కృష్ణచైతన్య పట్టణంలో పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. డిగ్రీ కళాశాల లైబ్రరీ హాలు నిర్మాణానికి అధికారులు రూ.19.87 లక్షలతో అంచనాలు రూపొందించారు. ఈ మేరకు చెక్కును ప్రిన్సిపాల్ టీకేవీ శ్రీనివాసరావుకు బైపాస్ రోడ్డులోని మాధవి ఎడిబుల్ ఆయిల్స్ ఫ్యాక్టరీ కార్యాలయంలో డైరెక్టర్ వేగుళ్ల చైతన్యబాబు, వేగుళ్ల ఆర్యన్ మంగళవారం అందజేశారు. లైబ్రరీ హాలు నిర్మాణం అనంతరం అందులో పుస్తకాల కోసం మరో రూ.2 లక్షలు అందజేస్తామని ప్రకటించారు. సంస్థ యాజమాన్యానికి ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వంక ప్రసాద్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆనంద్, అధ్యాపకులు పాల్గొన్నారు.



ప్రిన్సిపాల్ శ్రీనివాసరావుకు చెక్కు అందజేస్తున్న చైతన్యబాబు, ఆర్యన్